బతుకు.. బండి

ఏరోజుకు ఆరోజే ఆదాయం

- ఎంత అమ్మినా తక్కువే
- లాభాల్లేక పూటగడవని పరిస్థితి
- దుకాణాల కోసం స్థలం కేటాయించాలని మొర


పూలు అల్లుతున్న వ్యాపారి

కడ్తాల్: మండల కేంద్రంలో పూల వ్యాపారుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుంది. కష్టాల మధ్య తమ బతుకు..బండిని లాగుతున్నారు. పూలన్నీ అమ్మిన కొన్ని సార్లు పూటగడవని పరిస్థితి ఏర్పడుతుంది. పెళ్లీల సీజన్‌లో వ్యాపారం సాగుతుంది. వానొచ్చిన, ఎండకాసిన కష్టాలు షరా మాములే. మండల కేంద్రంలో సుమారు 10నుంచి 25వరకు కుటుంబాలు ఈ వ్యాపారాన్నే నమ్ముకుని జీవిస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కన చిన్న, చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు తోపుడు బండ్లపై మరి కొంత మంది, పూల గంప ఎత్తుకొని ప్రధాన రహదారిపై వ్యాపారం చేసుకుంటున్నారు. రోజురోజుకు పూల వ్యాపారుల పరిస్థితి మరీ దయనీయంగా మారుతుంది. పూలు అమ్మలేక వాడిపోయిన రోజులు కూడా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పూల వ్యాపారులకు సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని చెబుతున్నారు. శాశ్వత దుకాణాల్లేక తాము ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఏ రోజుకారోజే అమ్మాలి..

ఏ రోజు పూలు ఆరోజే అమ్ముడు పోవాలి. లేకపోతె నష్టమే. ఈ వ్యాపారంలో లాభాలు తక్కువ వస్తాయి. ఏ మాత్రం అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించినా, గిరాకీ లేక పోయినా ఇక అంతే సంగతులు. అదేవిధంగా పూలు నలిగిపోకుండా, వాడిపోకుండా చూసుకోవాలని వారు చెబుతున్నారు. ఒక్కోసారి ఎన్ని జాగ్రత్తలు వహించినా నష్టాలు మిగులుతాయని ఆవేదన వ్యక్త చేశారు. రోజుకు వెయ్యి నుంచి రూ.3వేల వరకు వ్యాపారం సాగుతుందని వారికి మిగిలేది చాల తక్కువేనని పేర్కొన్నారు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు..

మార్కెట్‌లో పూల ధరలు భాగా పెరగడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెరగడంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో మల్లె దండకు (250 గ్రాములు) గతంలో రూ. 50 నుంచి 60 లభించేదని, ప్రస్తుతం కిలో రూ.500కు చేరుకుందన్నారు. తెల్ల చామంతి కేజీ రూ.200, లిల్లీపూలు కేజీ రూ.150 నుంచి 200కు చేరాయని, బంతి పూలు కేజీ రూ.100నుంచి 120కు చేరిందని, కనకాంబరాలు రూ.500, గులాబీ కేజీ రూ.200కు చేరుకున్నాయని తెలిపారు.

15 సంవత్సరాలుగా ఇదే వ్యాపారం..



గత పదిహేను సంవత్సరాలుగా ఇదే వ్యాపారం చేస్తున్నాను. పెద్దగా సంపాదించింది ఏమిలేదు. పండగలకు పెళ్లీలకు వ్యాపారం భాగానే ఉన్నా, మిగతా రోజుల్లో ఇబ్బందిగానే ఉంటుంది. గిరాకీ తక్కువగా ఉంటుంది. రూ. 2వేలు అమ్మితే రూ.3 వందల నుంచి రూ.400 వరకు మిగులుతాయి.

– కృష్ణయ్య, పూల వ్యాపారి, కడ్తాల్

కష్టం, నష్టం ఎక్కువే..



పూలు ఒకటి నుంచి రెడ్రోజుల వరకు నిల్వ ఉంటుంది. ముసురు పడి తడిస్తే నలుపు రంగుల్లోకి మారుతాయి. ఎండకు వాడిపోతాయి. కాబట్టి పూల వ్యాపారంలో కష్టం, నష్టం ఎక్కువగా ఉంటుంది. చాలా ఏండ్లుగా మా కుటుంబం ఇదే వ్యాపారం చేస్తుండడంతో నేను కూడా ఈ వ్యాపారాన్నే నమ్ముకున్నాను.

– రఫిక్, పూల వ్యాపారి, కడ్తాల్

స్థలం కేటాయించాలి..



మండల కేంద్రంలో ప్రస్తుతం రోడ్డు పక్కన కిరాయి దుకాణాల్లో వ్యాపారం చేస్తున్నాం. రోడ్డు విస్తరణ చేపడితే ఎక్కడికి వెళ్లి వ్యాపారం చేయాలో అర్థం కావడం లేదు. పూల వ్యాపారుల విషయంలో ప్రభుత్వం స్పందించి బ్యాంకు రుణాలతో పాటు, పూలు విక్రయించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

– బాలకృష్ణ, పూలవ్యాపారి, కడ్తాల్

క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా యాదయ్య


యాదయ్యకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా రాసూరి యాదయ్యను నియమించారు. ఈ సందర్భంగా నియామక ప్రొసిడింగ్స్‌ను శనివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేశారు. డైరెక్టర్లుగా దొర్నాల మల్లేశ్, రాములమ్మ, జెట్టి కృష్ణ, డొంకని యాదగిరిగౌడ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి, ఎంపీటీసీ అచ్చన శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈశ్వర్, లక్ష్మీనృసింహాస్వామి ఆలయ చైర్మన్ నర్సింహ్మాగౌడ్‌తోపాటు నర్సింహా, సురేందర్, యాదయ్య పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి జెడ్పీటీసీ చేయూత


స్లాబ్ వేయిస్తున్న వెంకటేశ్

తలకొండపల్లి: నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించాడు. మండల కేంద్రానికి చెందిన నర్సింలు ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణపనులు నిలిపివేశాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ శనివారం నర్సింలు ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్, తదితర మెటీరియల్‌ను అందజేసి స్లాబ్ వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, లక్ష్మణ్‌నాయక్, వార్డు సభ్యులు విఠల్, రమేష్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండలం సాధించే వరకు పోరాటం


దీక్షాశిబిరంలో అశోక్‌గౌడ్

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం సాధించే వరకు పోరాటం చేస్తామని గౌడసంఘం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ అన్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశెఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్, శరత్‌శ్చంద్రశర్మ, విజయ్, కృష్ణ, పాల్గొన్నారు.

బీఎస్పీ నేతల అరెస్ట్


పోలీసుల అదుపులో బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా సంఘీబావం తెలిపేందుకు వెళ్తున్న నేతలను శనివారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న క్రమంలో గ్యార జగన్, బోళ్ల గణేశ్, పల్లాడి రాములు, కొండ్రు రఘుపతి, మహేందర్, కరుణాకర్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పొడిగించండి


మాట్లాడుతున్న ప్రకాశ్ కారత్

తుర్కయంజాల్: 'గృహలక్ష్మి' పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల చివరి నాటికి పొడిగించాలని పేదలందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్‌లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ


బల్బులపల్లి తండాలో దుస్తులు పంపిణీ చేసిన ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని బల్బులపల్లితండా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవినాయక్, నవీన్‌నాయక్, యాదగిరి, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు..

తండ్రి లేని చిన్నారుల చదువులకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ చేయూత నందిస్తున్నాడు. ట్రస్టు ద్వారా ఖర్చులను భరిస్తూ పదోతరగతి వరకు చదివిస్తానని భరోసా కల్పించారు. మండల పరిధిలోని వెల్జాల్, మాదాయిపల్లికి చెందిన భావన, గణేష్, సుప్రియ, మణి దీక్షిత్‌లు 2, 3, 8, 9వ తరగతులు చదువుతున్నారు. స్థానిక నాయకుడు ఎంపీటీసీ అంబాజీ సహకారంతో పిల్లల బంధువులు జెడ్పీటీసీని కలిసి తమ సమస్య వివరించారు. స్పందించిన ఆయన ట్రస్టు ద్వారా నలుగురు పిల్లలను చదివిస్తానని, పదోతరగతి వరకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం వెల్జాల్ విజేత స్కూల్ యజమాన్యంతో మాట్లాడి స్కూల్లో చేర్పించారు. ఉప సర్పంచ్ అజీజ్ పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: పాలమూరు-రంగారెడ్డి, కెఎల్‌ఐ ఎత్తిపోతల పథకాలతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకి సాగునీరు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు, పర్యావరణ అనుమతులు లభించాయని తెలిపారు. రూ.35 వేల కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి పాలమూర్, రంగారెడ్డి జిల్లాలో 12.50 లక్షల ఎకరాలకు, కల్వకుర్తి నియోజకవర్గంలోని 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. తక్షణమే కాల్వల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయ్య ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, డీటీ వినోద్‌కుమార్, రైతుబంధు అధ్యక్షుడు వీరయ్య, సాయిలు, లాయక్‌అలీ, రమేశ్, వినోద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

తలకొండపల్లి: జిల్లా వ్యాప్తంగా తలకొండపల్లిని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలకొండపల్లి మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయని విద్యార్థులు కళాశాల్లో చేరాలని ఎమ్మెల్యే కోరారు. రూ. 37 కోట్లతో తలకొండపల్లి-ఆమనగల్లు వరకు బీటీ డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. సంక్షేమంలో తెంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాలాపుం శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, జెడ్పీకో ఆప్షన్ ఎండీ ముజిబర్ రహ్మాన్, మాజీ జెడ్పీటీసీ నర్సింహా, ఎంపీటీసీ అంబాజీ, సర్పంచ్‌లు చంద్రయ్య హైమావతి, రామస్వామి, శివశంకర్‌రెడ్డి, సజ్జుపాషా, మార్కెట్ డైరెక్టర్‌లు శేఖర్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన యాదయ్యకు మంజూరైన రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం హైదరాబాద్‌లో ఆయన అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు గణేష్‌గుప్తా తల్లి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందనే సమాచారం తెలుసుకొని ఆమెను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గణేశ్‌గుప్తా, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

సీఐ కాశీవిశ్వనాథ్


టాస్ వేస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్ తదితరులు

మంచాల: క్రీడాకారులు గెలుపోటమిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. శనివారం మంచాల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌కు డ్రా తీసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓడితే నిరాశకు గురి కావద్దని, గెలిస్తే అతిగా సంతోషపడొద్దన్నారు. రెండిటిని సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సతీశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పురపాలికగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పించే చర్యలకు పురపాలక సంఘం శ్రీకారం చుట్టినట్లు పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. వార్డుల్లోని ప్రతీ వీధిలో చెత్తను ఎప్పటికప్పుడు ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తూ, బ్లీచింగ్‌ను చల్లిస్తున్నామన్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల డెంగీ, టైఫాయిడ్, వాంతులు, విరేచనాలతో కళ్లకలకతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్య నిర్వహణకు ప్రతీ ఒక్కరు సహకరించి ఆరోగ్య పురపాలక సంఘంగా పెద్దఅంబర్‌పేటను తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ విస్తీర్ణం ఎంత? ఎన్ని వార్డులు ఉన్నాయి?

జవాబు: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ మొత్తం విస్తీర్ణం 51.91 స్కేర్ మీటర్లు, 24 వార్డులు ఉన్నాయి. వాటిలో 150 వరకూ కాలనీలు ఉన్నాయి.

ప్రశ్న: మున్సిపాలిటీలో జనాభా ఎంత, ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు?

జవాబు: మున్సిపాలిటీలో 65 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతీ రోజు 153మంది పారిశుధ్య సిబ్బంది తెల్లవారుజాము నుంచే విధులు నిర్వహిస్తుంటారు. వీధుల్లో రోడ్లు ఊడుస్తూ, ప్రతీ ఇంటికి ఆటోల్లో తిరుగుతూ చెత్తను సేకరిస్తున్నారు.

అలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి రీ సైక్లింగ్ చేయిస్తున్నాం.

ప్రశ్న: చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారు. ఎంత చెత్తను సేకరిస్తున్నారు ? పారిశుధ్య నిర్వహణకు ఎంత ఖర్చు చేస్తున్నారు ?

జవాబు: మున్సిపాలిటీలో 24వార్డుల్లోని, 150 కాలనీల్లో చెత్తను సేకరించేందుకు 16 వాహనాలతో పాటు ఓ డీఆర్‌సీసీ వాహనాన్ని వినియోస్తున్నాం. తడిపొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు మున్సిపాలిటీ నుంచి ప్రతి ఇంటికీ రెండు చెత్త డబ్బాలను అందజేశాం. చెత్త సేకరించే వాహనాలు ఇళ్ల ముందుకు రాగానే తడిపొడి చెత్తను వేర్వేరుగా అందజేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రతీ ఏటా రూ.79లక్షల మేర ఖర్చు చేస్తున్నాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి జరిమానా విధిస్తామంటూ పలు హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: దోమల నివారణకు ఏం చేస్తున్నారు?.

జవాబు: దోమల నివారణకు ప్రతీ రోజు ఫాగింగ్ చేయిస్తుండడంతో పాటు మందులు పిచికారి చేస్తున్నాం. దోమల లార్వా వృద్ధి చెందకుండా మురికి నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. అలాగే ఇళ్లల్లోని పూల కుండిల్లో, పాత టైర్లు, వాడి పాడేసిన కొంబరి బొండాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నాం.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పుర ప్రజలకు ఎలాంటి సూచన చేస్తారు.?

జవాబు: సీజనల్ వ్యాధులపై ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. డెంగ్యూ, మలేరియా లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయాలి. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లలోని ప్రభుత్వ ఆసుపత్రిలతో పాటు పసుమాములలో బస్తీదవాఖానాలో వైద్యులు అందుబాటులో ఉంచాం. నిత్యం వేడి వేడి పదార్థాలను మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. పురపాలక సంఘం పరిధిలోని కళానగర్, ఆర్‌కెనగర్, రావినారాయణరెడ్డి కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: పారిశుధ్య కార్మికులకు క్రమంగా సబ్బులు, నూనెలు, విధుల్లో పనులు చేసేటప్పుడు చేతులకు వేసుకోవడానికి గోస్లులు, మాస్కులు, రెయిన్ కోట్లు ఇస్తున్నాం. ఇప్పటికే ఆరోగ్య బీమా కూడా చేయించాం.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


కడ్తాల్: ఆర్థిక సాయం చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్: మైసిగండి గ్రామానికి చెందిన సీత్యానాయక్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తులసీరాం నాయక్, వార్డు సభ్యుడు జవహర్‌లాల్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబానికి సర్పంచ్ తులసీరాం నాయక్ రూ.5వేలు, జవహర్‌లాల్ నాయక్ రూ.5 వేలు అందజేశారు.

స్కూల్ పిల్లల బస్‌పాస్‌లకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన స్కూల్ పిల్లలకు ఫ్రీ బస్ పాస్‌ల కోసం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి రూ. 3వేలు ఆర్థిక సహాయాన్ని ఆర్టీసీ అధికారులుకు అందజేశారు. ఖానాపూర్‌కు చెందిన అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ట్రస్టు సభ్యులచే రూ.3వేల సహాయం అందజేశారు. కార్యక్రమంలో రవి, గణేష్, మల్లేష్, శివాజీ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్..

గానుగుమార్లతండాకు చెందిన సాయి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.5వేల సాయం అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, అజ్గర్‌అలీ, ఇమ్రాన్‌బాబా, పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు


జెండా ఎగురవేస్తున్న శివకుమార్

తుర్కయంజాల్: ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం తుర్కయంజాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపు శివకుమార్, గోవర్ధన్, గండికోట శివ, వివేక్, సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం


మాట్లాడుతున్న సంఘం నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ యూఎస్‌పీసీ దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తోందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య పేర్కొన్నారు. యూఎస్‌పీసీ, ఎన్‌పీఎస్ (సీపీఎస్), ఎన్ఇపి-2020లను రద్దు చేయాలని ఎస్‌టీఎఫ్ఐ దేశవ్యాప్త క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షురాలు కల్పన, జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మహిపాల్, సీనియర్ నాయకులు యాదయ్య పాల్గొన్నారు.

గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతన గౌడసంఘం

ఆమనగల్లు: అవురుపల్లి గ్రామంలో శనివారం గౌడసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల గౌడసంఘం అధ్యక్షుడు గౌని నర్సింహా ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌడసంఘం అధ్యక్షుడిగా నిరంజన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అంజయ్యగౌడ్, కార్యదర్శులుగా నర్సింహాగౌడ్, రాములుగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, కోశాధికారిగా కృష్ణయ్యగౌడ్, సలహాదారులుగా హరిమోహన్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, బాలకృష్ణగౌడ్, వెంకటయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు

హరితహారంతో పచ్చదనం

అబ్దుల్లాపూర్‌మెట్: హరితహారంతో పచ్చదనం పెంపొందుతుందని, ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సీఐ మన్మోహన్ పేర్కొన్నారు. గుంతపల్లి గ్రామంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మేరా మట్టి-మేరా దేశ్‌లో భాగంగా హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ మన్మోహన్ హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశంపట్ల ప్రేమ, అభిమానాన్ని పెంచుకుంటూనే చదువులో రాణిస్తూ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠ తీసుకరావాలన్నారు. ఎస్‌ఐ సునీల్, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, శివకుమార్, బాలాజీ, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


రమణమ్మ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా, పోల్కంపల్లి గ్రామానికి చెందిన సామ యాదగిరిరెడ్డి, భార్య రమణమ్మ ఇద్దరు కుమారులతో తుర్కయంజాల్ సమీపంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం భర్తతో డబ్బు విషయమై గొడవ పడింది. దీంతో ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త యాదగిరిరెడ్డి బంధువుల ఇళ్లల్లో వెతికినా లాభం లేదు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ


యాచారం: మాట్లాడుతున్న అంజయ్య

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని 14 గ్రామాల నుంచి 1110, మున్సిపాలిటీ నుంచి 475 దరఖాస్తులు వచ్చాయి.

ముగిసిన గడువు..

ఈ నెల 10 నుంచి 12వరకే గృహలక్ష్మి పథకానికి అర్హులైన వారికి దరఖాస్తులు పెట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. శనివారంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసింది.

గడువు పెంచాలి..

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువును పెంచాలని సీపీఎం నాయకులు సామేల్, ఎల్లేశ్, బుగ్గరాములు డిమాండ్ చేశారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తుల గడువును పొడిగించాలని వారు డిమాండ్ చేశారు.

యాచారంలో..

యాచారం: మూడు రోజుల్లో 2,137 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. 10వ తేదీనా 352, 11న 738, 12వ తేదీ1,047 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

అర్హులైన పేదలను ఎంపిక చేయాలి..

ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో బీఆర్‌ఎస్ నాయకులే ఎంపిక చేస్తున్నారనే పుకార్లు వస్తున్నాయని ఈ విషయంలో తాము ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: 10వ తేదీన 308, 11న 442, చివరి రోజు శనివారం 487 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మొత్తం 1,237 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

దశాబ్దాలుగా మాదిగలకు అన్యాయం

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్


మాట్లాడుతున్న ప్రదీప్‌గౌడ్

కడ్తాల్: దశాబ్దాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 28న కల్వకుర్తిలో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ పోతుగంటి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉప కులాలకు రావాల్సిన వాటలో దశాబ్దాలుగా మోసానికి గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దర్వుల రాంచంద్రయ్య మాదిగ, తుడుం కిరణ్ మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అబ్బుర మేశ్‌మాదిగ, మైసయ్య, ల్లేశ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.